సంపుటి :02 సంచిక :64 పేజీలు :06

# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

వెల ₹5

మంగళవారం 22, ఏప్రిల్ 2025

## సివిల్స్‌లో మెరిసిన వరంగల్ బిడ్డ..

- ఎట్టబోయిన సాయి శివానికి 11వ ర్యాంకు
- పరీక్షా ఫలితాలను విడుదల చేసిన యూపీఎస్సీ

05


## రేపు ఎల్కతుర్తికి కేటీఆర్..

- రజతోత్సవ సభ ఏర్పాట్లు పరిశీలన
- గులాబీ నేతలకు వర్కింగ్ ప్రెసిడెంట్ దిశానిర్దేశం

03







★ కర్రెగుట్టలో కాల్పుల మోత!

★ వేల మంది సాయుధ బలగాల వేట !

# టార్గెట్ హిడ్మా!

మావోయిస్టు మోస్ట్ వాంటెడ్ లీడర్ హిడ్మా కోసం అడవిలో వేట కొనసాగుతోంది. ప్రస్తుతం ఆయన తలపై రూ. కోటి రివార్డు ఉంది. ఇటీవల కేంద్ర కమిటీ మెంబర్, ఒడిశా ఇన్‌చార్జి రామచంద్రారెడ్డి అలియాస్ చలపతి ఎన్‌కౌంటర్ హిడ్మా వైఫల్యంగానే భావించిన మావోయిస్టు పార్టీ ఆయన్ను కేంద్ర మిలిటరీ కమిషన్ ఇంచార్జి బాధ్యతల నుంచి తప్పించినట్లు ప్రచారం సాగింది. హిడ్మా స్థానంలో దేవ్‌ని నియమించారని తెలుస్తోంది. ఈక్రమంలోనే హిడ్మా దళం ములుగు జిల్లా కర్రెగుట్టలోకి ప్రవేశించినట్లుగా కేంద్ర బద్రతా బలగాలకు సమాచారం అందినట్లు తెలుస్తోంది. అందుకే తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ములుగు జిల్లాలో విస్తరించి ఉన్న కర్రెగుట్టలను సుమారు 12 వేల సాయుధ బలగాలు చుట్టుముట్టినట్లు సమాచారం. మొత్తం కర్రెగుట్టను కంట్రోల్‌లోకి తీసుకునేందుకు జల్లెడ పడుతున్నారు. నిన్ననే గుట్ట వద్దకు చేరుకున్న పోలీసులు ఇవాళ పెకి వెళ్తుండగా గుర్తించిన కొన్ని మందు పాతరలను నిర్వీర్యం చేసినట్లు సమాచారం. ఈక్రమంలోనే ఊసూర్ బ్లాక్‌లోని కర్రెగుట్టల సమీపంలో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య కాల్పులు జరిగినట్లు తెలుస్తోంది. అయితే కాల్పులను పోలీసులు ధృవీకరించలేదు. దీంతో ములుగు జిల్లాలో ఏ క్షణం ఏం జరుగుతుందో అనే టెన్షన్ నెలకొంది. – అక్షరదర్బార్, ములుగు

02

- మందు పాతరలను నిర్వీర్యం చేస్తూ ముందుకు..
- తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ బలగాల జాయింట్ ఆపరేషన్
- రెండు రాష్ట్రాల సరిహద్దులో యుద్ధ వాతావరణం
- ములుగు జిల్లాలో నూ హైటెన్షన్
- భయాందోళనలో ఆదివాసీలు, గిరిజన గూడేలు

## తవ్వే కొద్ది .. టోల్ బాధితులు!



- టోల్ ప్లాజా నిర్వాహకుల నిర్వాకంపై సర్వత్రా చర్చ
- మా క్కూడా ఇలానే జరిగిందంటూ వెలుగులోకి బాధితులు
- లక్షల్లో స్కాం జరిగిందంటూ గుసగసలు
- టోల్ ప్లాజా నిర్వాహకులపై చర్యలకు బీఆర్ఎస్ పార్టీ డిమాండ్

06


## క్వారీ నడవాలంటే రూ. 50 లక్షలివ్వాలి



- క్రషర్ యజమానికి ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బెదిరింపులు
- ఫోన్‌లో బూతులు తిడుతూ భయభ్రాంతులు..
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడి భార్య
- ప్రాణహాని ఉందంటూ.. రక్షణ కల్పించాలని వినతి
- సుబేదారి పీఎస్‌లో ఎమ్మెల్యేపై నాన్‌బెయిలబుల్ కేసు

05

## భూపాలపల్లికి బైపాస్ రోడ్డు!



**రూ.220 కోట్లతో ఎన్ హెచ్ ప్రతిపాదనలు**

**ఢిల్లీలో ఆమోదం పొందగానే డీపీఆర్**

**19 కిమీ బైపాస్ రోడ్డు నిర్మించేందుకు నిర్ణయం**

బైపాస్ రోడ్డు కావాలనే భూపాలపల్లి ప్రజల కల సాకారం కాబోతుంది. భూపాలపల్లి పట్టణం టచ్ కాకుండా బయటి నుంచి వాహనాల రాకపోకలు సాగేలా 19 కిమీ బైపాస్ రోడ్డు నిర్మాణానికి జాతీయ రహదారుల (ఎన్ హెచ్) విభాగం ప్రతిపాదనలు రూపొందించింది. రూ.220 కోట్లతో తయారు చేసిన ఈ ఎస్టిమేట్స్ ను కొద్ది రోజుల క్రితం ఢిల్లీకి పంపింది. ఆమోదం లభించగానే డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) తయారు చేయడానికి సన్నద్ధమైంది. నిధులు మంజూరైన వెంటనే ఈ ఏడాది లక్ష్మారెడ్డిపల్లి నుంచి బాంబులగడ్డ వరకు బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టే దిశగా అడుగులు వేస్తుంది. భూపాలపల్లి పట్టణంలో హైవేపై వాహనాల రద్దీ పెరిగిన దృష్ట్యా ప్రమాదాల నివారణకు కోసం స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఇక్కడ బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం ప్రత్యేక చొరవ కనబరుస్తున్నట్లు తెలిసింది.

– అక్షరదర్బార్, హనుమకొండ

06

- సాకారం కాబోతున్న భూపాలపల్లి ప్రజల కల
- స్థానిక ఎమ్మెల్యే జీఎస్సార్ ప్రత్యేక చొరవ

# ఉత్తమ అధికారిగా చిట్యాల సీఐ

అక్షర దర్బార్ భూపాలపల్లి క్రైం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల సర్కిల్ పరిధిలో నిషేధిత గంజాయి గుట్కా తదితర మాదక ద్రవ్యాలను అరికట్టడంలో ప్రధమ పాత్ర పోషించిన చిట్యాల సిఐ దగ్గు మల్లేష్ యాదవ్ కు ఆంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య చేతుల మీదుగా ఉత్తమ అధికారిగా ప్రశంసా పత్రం అందుకున్నారు, 2009 బ్యాచ్ కి చెందిన మల్లేష్ యాదవ్ ఎస్సైగా పరకాల ములుగు సిఐ గా జనగామ ఇంతేజార్ గంజ్ మరియు చిట్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్గా విధులు నిర్వహిస్తున్నారు చిట్యాల సీఐగా విధులు నిర్వహిస్తున్న క్రమంలో పదుల సంఖ్యలో గంజాయి ముఠాను చాకచక్యంగా తన సిబ్బందితో పట్టుకొని కేసులు నమోదు చేశారు ఈ క్రమంలో ఉన్నతాధికారులు ఆయనను గురువారం హైదరాబాద్ లో ప్రశంసా మీ పత్రంతో సన్మానించడం గమనార్హం,



# 25న భూభారతి పై అవగాహన


అక్షరదర్బార్, నూగూరువెంకటాపురం: తెలంగాణ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూభారతిపై ఈనెల 25న అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసిల్దార్ పీ లక్ష్మీరాజయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వెంకటాపురం మండలంలోని పాత్రపురం గ్రామంలోని రైతు వేదికలో ఉదయం 10 గంటలకు అవగాహన కార్యక్రమం ఉంటుందని రైతులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.





www.aksharadarbar.com
అక్షర దర్బార్ Voice of the people

# టార్గెట్.. హిడ్మా..?

- కర్రెగుట్టలో కాల్పుల మోత!
- వేల మంది సాయుధ బలగాల వేట !
- మందు పాతరలను నిర్వీర్యం చేస్తూ ముందుకు..
- తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ బలగాల జాయింట్ ఆపరేషన్
- రెండు రాష్ట్రాల సరిహద్దులో యుద్ధ వాతావరణం
- ములుగు జిల్లాలోనూ హైటెన్షన్
- భయాందోళనలో ఆదివాసీలు, గిరిజన గూడేలు







అక్షరదర్బార్, ములుగు: మావోయిస్టు మోస్ట్ వాంటెడ్ లీడర్ హిడ్మా కోసం అడవిలో వేట కొనసాగుతోంది. ప్రస్తుతం ఆయన తలపై రూ. కోటి రివార్డు ఉంది. ఇటీవల కేంద్ర కమిటీ మెంబర్, ఒడిశా ఇన్‌చార్జి రామచంద్రారెడ్డి అలియాస్ చలపతి ఎన్‌కౌంటర్ హిడ్మా వైఫల్యంగానే భావించిన మావోయిస్టు పార్టీ ఆయన్ను కేంద్ర మిలిటరీ కమిషన్ ఇంచార్జి బాధ్యతల నుంచి తప్పించినట్లు ప్రచారం సాగింది. హిడ్మా స్థానంలో దేవ్‌ని నియమించారని తెలుస్తోంది. ఈక్రమంలోనే హిడ్మా దళం ములుగు జిల్లా కర్రెగుట్టలోకి ప్రవేశించినట్లుగా కేంద్ర బద్రతా బలగాలకు సమాచారం అందినట్లు తెలుస్తోంది. అందుకే తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ములుగు జిల్లాలో విస్తరించి ఉన్న కర్రెగుట్టలను సుమారు 12 వేల సాయుధ బలగాలు చుట్టుముట్టినట్లు సమాచారం. మొత్తం కర్రెగుట్టను కంట్రోల్‌లోకి తీసుకునేందుకు జల్లెడ పడుతున్నారు. నిన్ననే గుట్ట వద్దకు చేరుకున్న పోలీసులు ఇవాళ పెకి వెళ్తుండగా గుర్తించిన కొన్ని మందు పాతరలను నిర్వీర్యం చేసినట్లు సమాచారం. ఈక్రమంలోనే ఊసూర్ బ్లాక్‌లోని కర్రెగుట్టల సమీపంలో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య కాల్పులు జరిగినట్లు తెలుస్తోంది. అయితే కాల్పులను పోలీసులు ధృవీకరించ లేదు. దీంతో ములుగు జిల్లాలో ఏ క్షణం ఏం జరుగుతుందో అనే టెన్షన్ నెలకొంది.

## ఎవరీ హిడ్మా ?

కర్రెగుట్టలో పోలీస్ బలగాల కూంబింగ్ నేపథ్యంలో ఎక్కడ చూసినా హిడ్మా పేరే వినిపిస్తోంది. ఇంతకీ ఎవరీ హిడ్మా? ఎక్కడివాడు ? ఏం చేశాడనేది చర్చనీయాంశంగా మారింది. ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లా జేగురుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని పువ్వర్తి మాడవి హిడ్మా స్వగ్రామం. ఐదో తరగతి వరకే చదువుకున్న ఆయన 25 ఏళ్ల వయసులోనే మావోయిస్టు పార్టీలో చేరారు.

అనతికాలంలోనే అంచెలంచెలుగా ఎదిగారు. ప్రస్తుతం కేంద్ర కమిటీ సభ్యుడిగా కూడా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. మావోయిస్టు పార్టీ పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) ఒకటో బెటాలియన్‌కు కమాండర్‌గా, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలో మెంబర్‌గా కీలకంగా పనిచేసినట్లు సమాచారం. ఆయన భార్య కూడా మావోయిస్టు పార్టీలో కీలక నేతగా ఉన్నారు. కూంబింగ్ ఆపరేషన్లు చేసి పోలీస్ బలగాలపై, సీఆర్పీఎఫ్ క్యాంపులపై మెరుపు వేగంతో దాడులు నిర్వహించడంలో దిట్టగా పేరుంది. అందుకే అత్యంత వేగంగా మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో సభ్యుడిగా హిడ్మా స్థానం సంపాదించారనే టాక్. తెలుగు రాష్ట్రాల వారు ఎక్కువగా ఉండే ఈ కమిటీలో సుక్మా నుంచి ఈ స్థానంలోకి వెళ్లిన తొలివ్యక్తిగా హిడ్మాకు పేరుంది. దండకారణ్యంపై పూర్తి పట్టున్న ఆయన కోసం కేంద్ర బలగాలు కొన్నేళ్లుగా వేట కొనసాగిస్తున్నాయి.

## ప్రెషర్ బాంబుపేలి ఒకరు మృతి

కర్రెగుట్టల చుట్టూ బాంబులు, లాండ్‌మైన్స్ అమర్చామని, ఎవరూ రావద్దంటూ వాజేడు - వెంకటాపురం డివిజన్ ఏరియా శాంత పేరుతో లేఖ కొద్ది రోజులు క్రితం ఓ లేఖ విడుదలైంది. అయితే తర్వాత అది ఫేక్ లెటర్ అని పౌరహక్కుల నేతల చెప్పారు. మావోయిస్టు సంఘాలు అలాంటి లేఖలు విడుదల చేయరని, శాంత పేరుతో ఎవరూ లేరని మావోయిస్టులు చెప్పినట్లుగా పౌరహక్కుల సంఘాలు తెలిపాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు బచావో కర్రెగుట్టలు పేరుతో స్పెషల్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. ములుగు ఎస్పీ శబరిష్ ఆదేశాలతో విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. కొద్ది రోజుల కింద కర్రెగుట్టల్లో అమర్చిన ప్రెజర్ బాంబు పేలి వెంకటాపురం మండలంలో ఒక మహిళ, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడగా, కొంగల అటవీ ప్రాంతంలో వంట చెరుకు కోసం వెళ్లిన వ్యక్తి ప్రెజర్ బాంబు పేలి మరణించిన సంగతి తెలిసిందే.



## దాడుల్లో దిట్ట..

- 2010 ఏప్రిల్ 6న సుక్మా జిల్లా తాడిమెట్ల అటవీ ప్రాంతంలో మైన్ ప్రొటెక్షన్ వాహనాన్ని మందుపాతరతో పేల్చివేసి కాల్పులు జరిపిన ఘటనలో హిడ్మా వెలుగులోకి వచ్చారు. ఇందులో 74 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు, ఒక సాధారణ పౌరుడు మృతి చెందాడు.
- 2017 మార్చ్ 12న సుక్మా జిల్లా బెజ్జి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తచెరువు దగ్గర రోడ్డు నిర్మాణ పనులకు భద్రతగా వెళుతున్న జవాన్లపై మందుపాతరతో హిడ్మా ఆధ్వర్యంలోనే దాడి జరిగింది. ఆ ఘటనలో 12 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు మృతి చెందారు.
- 2017 ఏప్రిల్ 24న చింతగుఫా పోలీస్ స్టేషన్ పరిధిలోని బుర్కా పాల్ సమీపంలో రోడ్డు పనులకు భద్రతకు వెళుతున్న సీఆర్పీఎఫ్ జవాన్లను చుట్టుముట్టి చేసిన దాడిలో 24 మంది జవాన్లు చనిపోయారు.
- 2018 మార్చి 13న సుక్మా జిల్లా కాసారం అటవీ ప్రాంతంలో మావోయిస్టులు మందుపాతర పేల్చడంతో 12 మంది జవాన్లు మృతి చెందారు.
- 2020 ఫిబ్రవరిలో ఇదే జిల్లా పిడిమెట్ అటవీ ప్రాంతంలో మందుపాతర పేల్చి కాల్పులు జరపడంతో 12 మంది డీఆర్జీ జవాన్లు మృతి చెందారు.
- 2021 ఏప్రిల్‌లో జరిగిన జీనుగూడెం అడవిలో తాను ఉన్నానని భద్రతా బలగాలను నమ్మించి పట్టుకునేందుకు వచ్చిన వారిలో 26 మందిని హతమార్చిన ఘటనలో హిడ్మా కీలకంగా ఉన్నారు.

## చర్చలకు సిద్ధమని ప్రకటించినా...

**ఇటీవల దండకారణ్యంలో కేంద్ర బలగాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నాయి. వరుస ఎన్‌కౌంటర్లతో గడిచిన మూడు నెలల్లోనే పదుల సంఖ్యలో మావోయిస్టులు మరణించారు. పలువురు అగ్రనేతలు కూడా ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఉద్యమానికి కోలుకోలేని దెబ్బ తగిలింది. వచ్చే ఏడాది మార్చికల్లా దేశంలో మావోయిస్టులు లేకుండా చేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఇప్పటికే ప్రకటించారు. దీంతో శాంతి చర్చలకు పిలుపునిచ్చారు మావోయిస్టులు. దండకారణంలో కాల్పులు ఆపేస్తే చర్చలకు సిద్ధమని ముందుకువచ్చారు. అయినా కేంద్రం నుంచి ఎలాంటి స్పందన లేదు. అంతేగాక ఆపరేషన్ కొనసాగుతూనే ఉంది. దీంతో మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ నుంచి మళ్లీ తెలంగాణ బాట పట్టినట్లు సమాచారం. వారంతా ములుగు జిల్లా శివారు కర్రెగుట్టల్లో ఉన్నారని పక్కా సమాచారంతో రెండు రాష్ట్రాల పోలీసులు ఆపరేషన్ చేపట్టినట్లు సమాచారం.**

# మొరాయిస్తున్న గ్రామపంచాయతీ ట్రాక్టర్లు

- పట్టించుకోని అధికారులు..
- ఇబ్బందిపడుతున్న సిబ్బంది

అక్షర దర్బార్, పరకాల : తెలంగాణలో గ్రామ పంచాయతీ పల్లెల్లో పరిశుభ్రత, అభివృద్ధి ప్రజల సౌలభ్యం కోసం ఉపయోగించేందుకు గత ప్రభుత్వం గ్రామాలకు ట్రాక్టర్లు, మినీ ట్రాలీలు గ్రామ పంచాయతీ నిధులతో తీసుకోవడం జరిగింది. గత రెండు సంవత్సరాల నుండి స్థానిక ఎన్నికలు లేకపోవడంతో గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు రావడం లేదు. దానితో గ్రామపంచాయతీలో పనులన్నీ ఎక్కడికి అక్కడే ఆగిపోతున్నాయి. గ్రామాల్లో సర్పంచ్ లేకపోవడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేసి కార్యదర్శుల ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ పనులను నిర్వహిస్తుంది. ఆ నిర్వహణకు కావలసిన నిధులు మంజూరు కాకపోవడంతో గ్రామపంచాయతీలో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోతున్నాయి. కొన్ని గ్రామపంచాయాలలో ట్రాక్టర్లు, మినీ ట్రాలీలకు సరైన నిర్వహణ లేకపోవడం మైనర్ రిపేర్లు చేయించలేని పరిస్థితిలో గ్రామపంచాయతీలో కనపడుతున్నాయి. దానితో గ్రామపంచాయతీలో ట్రాక్టర్లు స్టార్ట్ కాకాపోవడంతో గ్రామపంచాయతీ సిబ్బంది ట్రాక్టర్లను నెట్టి స్టార్ట్ చేయడం జరుగుతుంది. ఇలాంటి సంఘటన నడికూడ మండలంలోని గ్రామపంచాయతీలలో మంగళవారం కనపడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామపంచాయతీకి కేటాయించిన వాహనాలను మరమ్మత్తులు చేయించి ప్రజల సౌకర్యం ఉంచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





# ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు ఉండొద్దు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- మొగుళ్లపల్లి మండలంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి : రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ధాన్యం కొనుగోలు చేయాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. మంగళవారం మొగుళ్ళ పల్లి మండలం మొట్లపల్లి రంగాపురం ఇస్సిపేట కొరికిశాల గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే గండ్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు వేగంగా, సమర్థంగా జరగాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో తక్కల్లపల్లి రాజు చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ రఫీ మండల వ్యవసాయ శాఖ అధికారి సురేందర్ రెడ్డి సొసైటీ చైర్మన్ సంపెల్లి నరసింహా రావు మాజీ పీఏసీఎస్ చైర్మన్ నరహరి బక్కిరెడ్డి మాజీ ఎంపిటిసి మంద స్వామి మెట్టుపెల్లి మాజీ సర్పంచ్ కోమ్రోజు శ్రీనివాస్ గూడూరి రఘుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

## భూ భారతితో రైతుల సమస్యలు పరిష్కారం

అక్షర దర్బార్, చిట్యాల : ధరణి మూలంగా అనేక సమస్యలు తలెత్తి ఆర్థికంగా చితికిపోయిన రైతాంగం సమస్యలను భూభారతి పరిష్కరిస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం చిట్యాల మండల కేంద్రంలోని రైతు వేదికలో తహసీల్దార్ హేమ ఆధ్వర్యంలో భూభారతి 2025 రెవెన్యూ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ రాహుల్ శర్మ, అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీఓ రవి హాజరైన సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో ధరణి చట్టం ఏ తప్పు చేయకుండానే రైతులను, అధికారులను దోషులుగా నిలబెట్టిందన్నారు. ఈ పరిస్థితులన్నింటినీ అధ్యయనం చేసి మేధావులు, రాజకీయ నాయకులు, రైతు సంఘాల నాయకులు, అధికారులతో చర్చించి మెరుగైన ఆర్వోఆర్ చట్టాన్ని ప్రస్తుత ప్రభుత్వం రూపొందించిందన్నారు.

## బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చిట్యాల మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన పలువురి బాధితులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. నవాబుపేట గ్రామానికి చెందిన వలబోజు నరేంద్ర చారి, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బిళ్ళ స్వరూప, చేరిపెల్లి దేవేందర్ కు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కసిరెడ్డి సాయిసుధ రత్నాకర్ రెడ్డి, బొమ్మ శంకర్ పాల్గొన్నారు.

# జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

## భూపాలపల్లి డీఎస్పీ ఏ.సంపత్ రావు



అక్షర దర్బార్ భూపాలపల్లి క్రైం : నిరుద్యోగ యువత జాబ్ మేళాను సద్విని చేసుకోవాలని భూపాలపల్లి డి.ఎస్.పి ఏ. సంపత్ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో టాస్క్ సంస్థ నిర్వహిస్తున్న జాబ్ మేళా లో పలు ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. విద్యార్హతలు ప్రకారం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. క్యూ ఆర్ కోడ్ లో రిజిస్ట్రేషన్ చేయించుకొని వారు 27వ తేదీన నిర్బహించే జాబ్ మేళా స్టాళ్లలో నమోదు చేసుకోవాలని తెలిపారు. భూపాలపల్లి సబ్ డివిజన్ పరిధిలోని నిరుద్యోగ యువతి, యువకులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఈ జాబ్ మేళాలో ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలని పేర్కొన్నారు.

# చెరువులను చెరబడుతున్న వారిపై కేసులు నమోదు చేయాలి

## డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్



అక్షర దర్బార్, కాటారం: కాటారం మండలంలోని కొందరు వ్యక్తులు కొన్ని రోజులుగా చెరువులను తవ్వుతూ చేరబడుతున్నారని అలాంటి వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్ కోరారు. ఈ మేరకు కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్ రెడ్డి కి వినతి పత్రం అందజేశారు. చెరువుల పరిరక్షణ నిబంధనలకు విరుద్ధంగా యాక్ట్ 1905ని ఉల్లంఘిస్తూ ఎటువంటి అనుమతులు లేకుండా కొంతమంది అక్రమార్కులు చెరువులను చెరబడుతున్నారని సుమారు ఇప్పటి వరకు మూడు కోట్ల రూపాయలకు పైచిలుకు విలువ చేసే మట్టిని తరలించారన్నారు. దీని ద్వారా చెరువులు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయని కాటారం పరిధిలోని పోతులవాయ్ శివారులోని నల్ల గుంట, విలాసాగారం, శంకరంపల్లి ,దేవరంపల్లి, పరికిపల్లి చెరువులలో ఈ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. తక్షణమే చెరువు శిఖం భూముల్లో మట్టిదోపిడీ చేస్తున్న అక్రమార్కులపై సమగ్ర విచారణ జరిపి క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు లో పేర్కొన్నారు. చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతామని శ్రీకాంత్ హెచ్చరించారు.

# బీఆర్ఎస్ సభకు తరలిరావాలి


## బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్



అక్షర దర్బార్,చిట్యాల : ఈ నెల 27న వరంగల్ ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు భారీగా జనం తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్ కోరారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ.. కొట్లాడి సాధించుకున్న రాష్ట్రాన్ని పదేండ్ల కేసీఆర్ పాలనలో అన్నిరంగాల్లో దేశంలోనే నెంబర్ వన్ గా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు.

# అవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దు

## పరకాల ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు




అక్షర దర్బార్, పరకాల : గత రెండు మూడు రోజుల నుండి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటున్నందున ప్రజలు తప్పని సరి పరిస్థితిలో తప్ప బయట తిరగ కూడదని పరకాల యంపీడీఓ పెద్ది ఆంజనేయులు సూచించారు. ఒక వేళ బయటకు వెళ్లినా వెంట గొడుగు మంచినీళ్లు తీసుకెళ్లాలని అన్నారు. ఎండ తీవ్రత వల్ల గ్రామాలలో మంచి నీటి ఎద్దడి రాకుండా పంచాయతీ కార్యదర్శులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో ఎన్ఎంలు, ఆశావర్కర్ల వద్ద ఓఆర్ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచాలని మండల వైద్యాధికారిని కోరారు.

# ఇంటికో మనిషి, ఊరుకో బండి.. కేసీఆర్ సభకు రండి..



అక్షర దర్బార్, పరకాల : ఈనెల 27న ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఇంటికో మనిషి.. ఊరుకో బండి.. కేసీఆర్ సభకు రండి అని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నక్క చిరంజీవి పిలుపునిచ్చారు. మంగళవారం చిరంజీవి మాట్లాడుతూ బీఆర్ఎస్ 25 ఏళ్ల మహాప్రస్థానం ఈనెల ఏప్రిల్ 27న మరో అద్భుతం ఆవిష్కృతం కానుంది. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంది రాక్షస పాలనని, దాన్ని తిప్పికొట్టేందుకు ప్రజలకు రజతోత్సవ సభ భరోసానిస్తుందని అన్నారు. పరకాల ప్రాంత ప్రజలు యువత మహిళలు కార్మికులు రైతాంగం రాష్ట్ర భవిష్యత్తుకై జరుగుతున్న మహోద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## దామెర మండలంలో
# బ్యాంక్ ఏర్పాటు చేయాలి



అక్షర దర్బార్, పరకాల : దామెర మండల కేంద్రంలో బ్యాంకు శాఖను ఏర్పాటు చేయాలని బీజేపీ దామెర మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ముల్క ప్రసాద్, బత్తుల సుమంత్ హనుమకొండ జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. గత తొమ్మిదేళ్లుగా దామెర మండల కేంద్రంగా కొనసాగుతున్నప్పటికీ బ్యాంకింగ్ సదుపాయాలు లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల ఆర్థిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని తక్షణమే దామెరలో బ్యాంకు శాఖను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



# కొడుకును కడతేర్చిన కసాయి తండ్రి

- కోడలిని దక్కించుకోవాలనే దురాశతో ఘాతుకం
- రోకలి బండతో తలపై బాది హత్య



అక్షర దర్బార్, రేగొండ: మానవత్వం మంటగలిసింది.వాయి వరుసలు మరిచిన తండ్రి దురాశ...కన్న కొడుకునే బలితీసుకుంది.కూతురితో సమానంగా చూడాల్సిన కోడలి పై మామ కన్ను పడింది.ఎలాగైనా కోడలిని దక్కించుకోవాలనే దుర్బుద్ధి పేగు బంధాన్ని తెంచుకునే వరకు వెళ్లింది.దీంతో కన్న కొడుకునే రోకలి బండతో బలంగా మోది అతి కర్కశంగా చంపాడు ఓ తండ్రి. పూర్తి వివరాల్లోకి వెళ్తే పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రేగొండ మండలం రేపాకపల్లె గ్రామానికి చెందిన కసం ఒదెలు (35),108 లో అంబులెన్స్ డ్రైవర్ గా పని చేస్తున్నాడు.ఒదెలుకు పరకాల మండలానికి చెందిన దేవితో 14 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది.ఒదెలు తండ్రి కసం మొండయ్య కొన్ని సంవత్సరాలుగా కోడలు దేవి తో అసభ్యంగా ప్రవర్తిస్తూ ఉండేవాడు. దీంతో పెద్ద మనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు జరిగినా తన ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోగా కొడుకు ఒదెలు పై కక్ష పెంచుకుని రోజు గొడవకు దిగుతూండేవాడు.ఈ క్రమంలోనే నిన్న సోమవారం ఒదెలు తన పెళ్లిరోజు కావడంతో రాత్రి 7 గంటల సమయంలో పెళ్లిరోజు వేడుకలు చేసుకుంటూ ఉండగా మాటా మాటా పెరిగి తండ్రి కొడుకులకు గొడవ జరిగింది. దీంతో ఎలాగైనా కొడుకు అడ్డు తొలగించి కోడలిని దక్కించుకోవాలనే ఉద్దేశంతో ఉన్నాడు. దీంతో మంగళవారం ఉదయం ఒదెలు తన ఇంటి ముందు వరండాలో పరుపుపై పడుకుని ఉండగా చుట్టుపక్కల ఎవరూ లేరు. ఇదే సరైన సమయం అని భావించిన మొండయ్య దగ్గర్లో ఉన్న రోకలి బండతో తలపై కొట్టగా తీవ్ర రక్తస్రావం జరిగి ఒదెలు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి కుమారుడు ఉండగా తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రేగొండ ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు.

## చిట్యాల ప్రభుత్వ కళాశాల
# విజయ దుందుభి

### అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు



జీ. అనిల్
MPC 969/1000

అక్షర దర్బార్,చిట్యాల : కార్పొరేట్ కు దీటుగా చిట్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించి విజయ దుందుభి మోగించారు. మంగళవారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో సెకండియర్ లో 90%, ఫస్ట్ ఇయర్లో 62% ఉత్తీర్ణత నమోదైనట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. ఎంపీసీ సెకండ్ ఇయర్ లో జి.అనిల్ 969/1000, జి.మాధురి 966, జి.రాహుల్ 957, ఎన్.సౌమ్య 924, ఏ.నవ్య 900, బైపీసీ సెకండియర్ లో ఏం.శ్రీ వాణి 900, ఎన్.ప్రియాంక 880, బి.అజయ్ 880, CEC సెకండ్ ఇయర్ లో ఏ.శివ 608/1000, HEC సెకండ్ ఇయర్ లో పి.చందు 632 మార్కులు సాధించారు. అదేవిధంగా ఫస్టియర్ లో ఎంపీసీలో ఎన్.అంజలి 457/470, జి.మానసి 446, ఏం.అంజలి 432, ఏం.శరణ్య 427, బైపీసీలో ఎం.హర్షిత 405, ఏ.వైష్ణవి 393, సీఈసీలో ఇ.రాహుల్ 362/500, ఓ.సమత 354 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ బి.శ్రీదేవి తెలిపారు. విద్యార్థులను లెక్చరర్లు, ప్రిన్సిపాల్ అభినందించారు.



జీ. మాధురి
MPC 966/1000



జీ. రాహుల్
MPC 957/1000



ఎన్. సౌమ్య
MPC 924/1000




## భూ భారతి చట్టంతో
# భూసమస్యలు పరిష్కారం

### నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి


అక్షర దర్బార్, చెన్నారావుపేట/ఖానాపురం: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టంతో తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న రైతుల భూ సమస్యలు సంపూర్ణంగా పరిష్కరించబడతాయని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మంగళవారం నర్సంపేట డివిజన్ లోని చెన్నారావుపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన భూభారతి సదస్సుకు కలెక్టర్ సత్య శారద దేవితో కలిసి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ధరణి పేరుతో గత పాలకులు గ్రామాల్లో వందల ఎకరాలు నిషేధిత జాబితాలో పెట్టి పేద ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని, చిన్న చిన్న మార్పులకు కూడా తహసీల్దార్, ఆర్డీవో లకు అధికారం లేకుండా చేసి జిల్లా కలెక్టర్ వద్ద అధికారాలను కేంద్రీకృతం చేసి సమస్యలను మరింత క్లిష్టతరం చేశారన్నారు. భూ భారతి చట్టం ద్వారా వారసత్వ హక్కుల్ని దర ఖాస్తులను నెల రోజులలో పూర్తి చేయాలని నియమాన్ని చట్టంలో చేర్చామని తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ భూములను అక్రమంగా పట్టాలు పొందితే వాటిని రద్దు చేసే అధికారం భూ భారతి చట్టంలో పొందుపరిచామని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో ఉమారాణి, నర్సంపేట మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ పాల్గొన్నారు..



గిరబోయిన ఉమామహేశ్వర్
978/1000



పిన్నింటి యశ్వంత్ రెడ్డి
466/470



వంగాల రణసాగర్ రెడ్డి
406/470

## ఇంటర్ ఫలితాల్లో
# ఖానాపురం ప్రభంజనం

- ఖానాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ర్యాంకుల పంట
- ఇంటర్ ఫస్ట్, సెకండీయర్ ఫలితాల్లో జిల్లా ప్రథమ ర్యాంకులు

అక్షర దర్బార్ ఖానాపురం,. కార్పొరేట్ ప్రైవేటు కళాశాలలకు దీటుగా ఖానాపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించి విజయ దుందుభి మోగించారు. మంగళవారం వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఖానాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ సెకండియర్ లో 90%, ఫస్ట్ ఇయర్లో 82% ఉత్తీర్ణ తతో మంచి ఫలితాలను సాధించారని ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలిపారు. ఎంపీసీ సెకండీయర్లో గిరబోయిన ఉమామహేశ్వర్ 978/1000 సాధించి జిల్లాలో ప్రథమ స్థానం సాధించాడు. బైపీసీ సెకండియర్ లో జి.పూజిత 918/1000 సాధించి జిల్లా ర్యాంక్ సాధించారు. ఎంపీసీ ఫస్ట్ ఇయర్ లో పిన్నింటి యశ్వంత్ రెడ్డి466/470 సాధించి జిల్లా ప్రథమ ర్యాంక్ సాధించాడు. వంగాల రణసాగర్ రెడ్డి 406/470 సాధించాడు. బైపీసీ ఫస్టియర్ లో పూజిత 378/44 0 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, లెక్చరర్లను ప్రిన్సిపాల్ శ్రీధర్ అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సదానందం, శోభ, తిరుపతమ్మ రవికుమార్, విజయకుమార్, సదానందం, రమాదేవి ,సంజీవ, రాజేష్, సంతోష్ ,కుమార్ కృష్ణమూర్తి ,సుధీర్ కుమార్, కేశవరెడ్డి, నాగశ్రీ ,అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు

# మైలారంలో బడిబాట



శాయంపేట : మండలం లోని మైలారం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ముందస్తు బడిబాట కార్యక్రమం నిర్వహిస్తు న్నారు. మంగళవారం హెచ్ఎం నాగ సుభాషిని ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఇంటింటా తిరిగి, బడి ఈడు పిల్లల తల్లిదండ్రులను కలిసి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంధ్యారాణి, రమేష్, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

# ఐస్ క్రీమ్ తయారీ షాపుపై టాస్క్‌ఫోర్స్ దాడులు

అక్షరదర్బార్, వరంగల్: కరీమాబాద్‌లోని దయానంద్ ఐస్ క్రీమ్ డిస్ట్రిబ్యూటర్‌లో పాడైన అమ్మకానికి సిద్ధంగా నిల్వచేసిన దాదాపు 9 రకాల సుమారు రూ.94,500 విలువ గల ఐస్ క్రీమ్ ఉత్పత్తులు స్వాధీనం చేసుకున్నట్లు ఇన్ స్పెక్టర్ బాబులాల్ తెలిపారు. ఇరుకుళ్ళ సదానందం నిర్వహిస్తున్న దయానంద్ ఐస్ క్రీమ్ తయారీ, డిస్ట్రిబ్యూషన్ షాపులో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లతో సంయుక్తంగా దాడి చేశారు. షాప్ ఓనర్ సదానందను విచారణకు ఫుడ్ సేఫ్టీ అధికారికి అప్పగించారు.

# ములుగు ఫస్ట్.. మానుకోట లాస్ట్

- **ఇంటర్ ఫలితాలు విడుదల**
- **మరోమారు సత్తాచాటిన బాలికలు**

అక్షరదర్బార్, హైదరాబాద్: ఇంటర్ వార్షిక పరీక్షల ఫలితాలు విడుదల అయ్యాయి. నాంపల్లిలోని ఇంటర్మీడియట్ బోర్డులో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ కలిసి విడుదల చేశారు. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్‌లో అమ్మాయిలు సత్తా చాటారు. ఫస్టియర్ ఫలితాల్లో 65.96 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికలు 73.83 శాతం, బాలురు 57.83 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్ పరీక్షలకు 4,88,430 మంది హాజరు కాగా 3,22,191 మంది ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్‌లో 65.65 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, బాలికలు 74.21 శాతం, బాలురు 57.31 శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్ పరీక్షలకు 5,08,582 మంది హాజరు కాగా, 3,33,908 మంది ఉత్తీర్ణత సాధించారు.

### మే 22నుంచి సప్లిమెంటరీ ..

ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో మేడ్చల్ జిల్లా (77.59శాతం) టాప్‌లో నిలిచింది. సెకండియర్లో ములుగు జిల్లా (80.12శాతం) విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. రెండో స్థానంలో ఆసిఫాబాద్ జిల్లా నిలిచింది. ఇక కామారెడ్డి, మహబూబాబాద్ జిల్లాలు చివరి స్థానాల్లో నిలిచాయి. ప్రభుత్వ కళాశాలల్లోని విద్యార్థులు సైతం సత్తాచాటారు. మెరుగైన ఫలితాలు సాధించి ఔరా అనిపించారు. ఫెయిలైన విద్యార్థుల కోసం మే 22 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు.





# అక్రమ సంబంధానికి అడ్డొస్తున్నాడని..

- **ప్రియుడితో కలిసి యువకుడి దారుణ హత్య**
- **గొంతు నులిమి.. మృతదేహాన్ని బావిలో పడేసి కిరాతకం**
- **మృతుడు నిందితురాలికి దగ్గరి బంధువు**
- **కానిస్టేబుల్‌తోపాటు మరో నలుగురు అరెస్ట్**
- **హత్య కేసును ఛేదించిన హన్మకొండ పోలీసులు**
- **కారు, రెండు ఆటోలు, రెండు బైక్‌లు, ఎయిర్ పిస్టల్ స్వాధీనం**
- **వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్**

అక్షరదర్బార్, హన్మకొండ: అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని... ప్రియుడితో యువకుడిని దారుణంగా హత్య చేయించింది ఓ మహిళ. ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసి సస్పెన్షన్‌కు కారణమైన సాయి ప్రకాశ్‌ను అంతమొందించిన కానిస్టేబుల్‌తో సహా ఐదుగురిని హన్మకొండ పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుండి ఒక కారు, రెండు ఆటోలు, రెండు ద్విచక్ర వాహనాలు, ఒక ఎయిర్ పిస్టల్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో ములుగు వెంటాపురం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ బాషబోయిన శ్రీనివాస్, చింతగట్టుకు చెందిన దేవిలీ సాయి, గుంటూరు జిల్లాకు చెందిన ఆలోత్ అరుణ్‌కుమార్, హన్మకొండకు చెందిన సబావత్ అఖిల్ నాయక్, రాజు, ములుగు జిల్లాకు చెందిన చింతం నిర్మల ఉన్నారు. అరెస్టుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వివరాలను వెల్లడించారు.

### అసలేం జరిగింది..

ఈనెల 15న ములుగు జిల్లా వెంటాపురం (వాజేడు) ప్రాంతానికి చెందిన చిడెం సాయిప్రకాశ్ (మృతుడు) అదృశ్యమైనట్లు హన్మకొండ పోలీసులు కేసు నమోదు చేశారు. యువకుడి బంధువులు వెంకటాపురానికి చెందిన కానిస్టేబుల్ శ్రీనివాస్‌పై అనుమానం వ్యక్తం చేయగా పోలీసులు నిందితుల్లో ఒకడైన దేవిలీ సాయిని హన్మకొండ బస్టాండ్‌లో అదుపులో తీసుకుని విచారించారు. మిగతా నిందితులు అంతా వరంగల్ కోర్టు వెనుక భాగంలో ఆటోలో వున్నట్లుగా ఇచ్చిన సమాచారంతో మరో నలుగురు నిందితులను అరెస్టు చేశారు. మహిళా నిందితురాలు నిర్మలను హన్మకొండ బస్టాండ్‌లో అదుపులోకి తీసుకొని విచారించారు. ప్రధాన నిందితుడైన శ్రీనివాస్ 2009 హైదరాబాద్‌లో కానిస్టేబుల్‌గా ఎంపికై పరస్పర బదిలీల్లో హన్మకొండకు వచ్చాడు. మరికొద్ది రోజులకు మరోమారు ములుగు జిల్లా వెంకటాపురం పోలీస్ స్టేషన్ బదిలీ అయ్యాడు. నిందితుడు విధులు నిర్వహించే సమయంలో ఇదే ప్రాంతంలో నివసించే నిర్మలతో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కాస్తా ఆక్రమ సంబంధంగా మారటంతో నిందితురాలి బంధువు వరసకు కొడుకైన మృతుడు సాయి ప్రకాశ్‌తోపాటు నిందితురాలి భర్త అమె బంధువులు కానిస్టేబుల్ శ్రీనివాస్ వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీస్ అధికారులు కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేశారు. శ్రీనివాస్ తిరిగి గత డిసెంబర్‌లో విధుల్లో చేరాడు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి తన సస్పెండ్ కారణమైన మృతుడి సాయి ప్రకాశ్‌పై కక్షపెంచుకున్నాడు.

### అనుమానాదాస్పద మృతిగా కేసు..

ఈనెల 15న నిందితురాలు నిర్మల తన మామ ఆరోగ్య పరీక్షల కోసం భర్తతోపాటు, సాయి ప్రకాశ్‌తో కలిసి హన్మకొండకు కారులో వచ్చినట్లుగా నిందితుడు శ్రీనివాస్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. వెంటనే మిగతా నిందితులతో కలిసి అదే రోజు రాత్రి మృతుడు సాయి ప్రకాశ్ ఒంటరిగా ప్రయాణిస్తున్న కారును ఆటోలో వెంబడించారు. రాత్రి 11:30 సమయంలో గోపాల్‌పూర్ క్రాస్ రోడ్ వద్ద కారు అడ్డగించి నిందితులు కారులోకి ఎక్కి నడుపుతూ సాయి ప్రకాశ్‌ను తీవ్రంగా కొట్టుకుంటూ హసన్‌పర్తి శివారు ప్రాంతంలో కారు అపి శాలువాతో గొంతుని బిగించి దారుణంగా హత్య చేశారు. అనంతరం నిందితులు మృతుడి కారులోనే హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జిల్లెడు గడ్డ తండా శివారు బావిలో మృతదేహాన్ని పడవేసి తిరిగి వేలేరు మీదుగా హన్మకొండ ఏషియన్ మాల్ ప్రాంతంలో కారు పార్క్ చేశారు. మరుసటి రోజు జిల్లెడు గడ్డ తండా వాసులు ఇచ్చిన సమాచారంతో అనుమానాదాస్పదంగా కేసుగా నమోదు చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కబరిచిన హన్మకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి, ఇన్స్‌స్పెక్టర్ సతీష్‌తోపాటు ఇతర పోలీస్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

# క్వారీ నడవాలంటే రూ.50 లక్షలివ్వాలి

- **క్రషర్ యజమానికి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి బెదిరింపులు**
- **ఫోన్‌లో బూతులు తిడుతూ భయభ్రాంతులు..**
- **పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడి భార్య**
- **సుబేదారి పీఎస్‌లో ఎమ్మెల్యేపై నాన్‌బెయిలబుల్ కేసు**

అక్షరదర్బార్, హన్మకొండ: హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో నాన్ బెయిల్ కేసు నమోదైంది. క్రషర్ యజమానిని బెదిరించి డబ్బులు డిమాండ్ చేశారని హన్మకొండకు చెందిన కట్టా ఉమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హన్మకొండలో నివాసం ఉండే తన భర్త కట్టా మనోజ్‌రెడ్డి కమలాపూర్ మండలం వంగపల్లి గ్రామంలో గ్రానైట్ క్వారీ నిర్వహిస్తున్నాడని పేర్కొన్నారు. క్వారీ నడవాలంటే తనకు డబ్బులు ఇవ్వాలని కౌశిక్‌రెడ్డి బెదిరించి గతంలో రూ. 25 లక్షలు తీసుకున్నారన్నారు. మళ్లీ ఈనెల 18న తన భర్తకు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. నీకు సంబంధించిన క్వారీ నడవ ాలంటే మరో రూ. 50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడన్నారు. డబ్బులు ఇవ్వకపోతే తన భర్తను, కుటుంబ సభ్యులను చంపుతానని ఫోన్లో బూతులు తిడుతూ బెదిరింపులకు గురి చేశారని ఉమాదేవి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యేలతో తన కుటుంబానికి ప్రాణహాని ఉందని, తమకు రక్షణ కల్పించి, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

# సివిల్స్‌లో మెరిసిన వరంగల్ బిడ్డ..

- **ఎట్టబోయిన సాయి శివానికి 11వ ర్యాంకు**
- **పరీక్షా ఫలితాలను విడుదల చేసిన యూపీఎస్సీ**

అక్షరదర్బార్, వరంగల్: యూపీఎస్సీ - 2024 సివిల్ సర్వీసెస్ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. వారణాసికి చెందిన శక్తి దూబే ఫస్ట్ ర్యాంకు సాధించారు. సివిల్స్ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు సత్తాచాటారు. వరంగల్‌కు చెందిన ఎట్టబోయిన సాయి శివాని 11వ ర్యాంకు వచ్చింది. బన్నా వెంకటేశ్ 15వ ర్యాంకు సాధించాడు. అభిషేక్ శర్మకు 38వ ర్యాంకు, రావుల జయసింహారెడ్డికి 46వ ర్యాంకు, శ్రవణ్‌కుమార్ రెడ్డికి 62వ ర్యాంకు, సాయి చైతన్య జాదవ్‌కు 68వ ర్యాంకు, ఎన్ చేతనరెడ్డికి 110వ ర్యాంకు, చెన్నంరెడ్డి శివగణేష్ రెడ్డికి 119వ ర్యాంకు వచ్చాయి. అయితే ఈసారి టాప్-10 జాబితాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు ఒక్కరు కూడా లేరు.

### మొత్తం 1056 పోస్టులు

కాగా కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో మొత్తం 1056 ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ తదితర పోస్టుల భర్తీకి గత ఏడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ విడుదలైంది. జూన్ 16న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించారు. అందులో అర్హత సాధించిన వారికి సెప్టెంబర్ 20 నుంచి 29వ వరకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించారు. మెయిన్స్‌లో సత్తాచాటిన వారికి జనవరి 7 నుంచి ఏప్రిల్ 17 వరకు దశల వారీగా పర్సనల్ ఇంటర్వ్యూలు చేశారు. తాజాగా తుది ఫలితాలను ప్రకటించారు. మొత్తం 1,009 మందిని యూపీఎస్సీ ఎంపిక చేయగా జనరల్ కేటగిరీలో 335 మంది, ఈడబ్ల్యూఎస్ నుంచి 109 మంది, ఓబీసీ నుంచి 318 మంది, ఎస్సీ కేటగిరీలో 160 మంది, ఎస్టీ కేటగిరీ నుంచి 87 మంది చొప్పున ఉన్నారు.

# నకిలీ వైద్యుడి అరెస్ట్

- **డాక్టర్ అవతారం ఎత్తిన ఆర్‌ఎంపీ**
- **స్టెరాయిడ్లు, యాంటీ బయోటిక్స్ అనధికారంగా వినియోగం**

అక్షరదర్బార్, వరంగల్ : మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ డాక్టర్ అవతారం ఎత్తిన ఆర్‌ఎంపీ బీ జ్ఞానేశ్వర్‌పై తెలంగాణ వైద్య మండలి రిజిస్ట్రార్ డాక్టర్ దండెం లాలయ్య, చైర్మన్ డా. కె.మహేష్ కుమార్ అధికారిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. తెలంగాణ వైద్య మండలి (TGMC) అధికారుల తనిఖీల సమయంలో రామన్నపేట ప్రాంతంలో జ్ఞానేశ్వర్ అనే ఆర్ ఎం పి తగిన వైద్యపరమైన అర్హత లేకుండా ప్రజలకు స్టెరాయిడ్లు, యాంటీబయోటిక్స్ అనధికారంగా ఇస్తున్నట్లు గుర్తించారు. దీంతో మట్టవాడ పోలీస్ స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ప్రజల ఆరోగ్యం కోసం తెలంగాణ వైద్య మండలి మరింత కఠిన చర్యలు తీసుకుంటుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ నకిలీ వైద్యవ్యవస్థను ఉపేక్షించేది లేదని తెలంగాణ వైద్య మండలి అధికారి వైస్ చైర్మన్ డాక్టర్ జి.శ్రీనివాస్ హెచ్చరించారు. నకిలీ వైద్యులపై ఫిర్యాదు కోసం వాట్సాప్ ద్వారా 91543 82727 నెంబర్ లేదా ఇమెయిల్ : antiquackerytsmc@onlinetsmc.in ఫిర్యాదు చేయాలని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ప్రజా సంబంధాల కమిటీ చైర్మన్ డాక్టర్ వి. నరేష్‌కుమార్ సూచించారు.



# బాలకృష్ణకు పరామర్శ

## ఆరోగ్య వివరాలను ఆరా తీసిన మంత్రి సీతక్క

అక్షరదర్బార్, మంగపేట: మంగపేట మండలం రమణక్కపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి, సింగల్ విండో డైరెక్టర్ కోడం బాలకృష్ణ కొద్దిరోజుల క్రితం బైక్ యాక్సిడెంట్ లో గాయపడగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క మంగళవారం ఆయన ఇంటికి చేరుకుని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరామ్ రెడ్డితో పాటు పార్టీ జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, మండల సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



www.aksharadarbar.com
అక్షర దర్బార్
Voice of the people



# భూపాలపల్లికి బైపాస్ రోడ్డు

- రూ.220 కోట్లతో ఎన్ హెచ్ ప్రతిపాదనలు
- ఢిల్లీలో ఆమోదం పొందగానే డీపీఆర్
- 19 కిమీ బైపాస్ రోడ్డు నిర్మించేందుకు నిర్ణయం
- సాకారం కాబోతున్న భూపాలపల్లి ప్రజల కల
- స్థానిక ఎమ్మెల్యే జీఎస్సార్ ప్రత్యేక చొరవ

అక్షరదర్బార్, హనుమకొండ: బైపాస్ రోడ్డు కావాలనే భూపాలపల్లి ప్రజల కల సాకారం కాబోతుంది. భూపాలపల్లి పట్టణం టచ్ కాకుండా బయటి నుంచి వాహనాల రాకపోకలు సాగేలా 19 కిమీ బైపాస్ రోడ్డు నిర్మాణానికి జాతీయ రహదారుల (ఎన్ హెచ్) విభాగం ప్రతిపాదనలు రూపొందించింది. రూ.220 కోట్లతో తయారు చేసిన ఈ ఎస్టిమేట్స్ ను కొద్ది రోజుల క్రితం ఢిల్లీకి పంపింది. ఆమోదం లభించగానే డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) తయారు చేయడానికి సన్నద్ధమైంది. నిధులు మంజూరైన వెంటనే ఈ ఏడాది లక్ష్మారెడ్డిపల్లి నుంచి బాంబులగడ్డ వరకు బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టే దిశగా అడుగులు వేస్తుంది. భూపాలపల్లి పట్టణంలో హైవేపై వాహనాల రద్దీ పెరిగిన దృష్ట్యా ప్రమాదాల నివారణకు కోసం స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఇక్కడ బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం ప్రత్యేక చొరవ కనబరుస్తున్నట్లు తెలిసింది.

### - భారీ వాహనాల రద్దీ

మహారాష్ట్రలోని సిరోంచ నుంచి కాళేశ్వరం, మహదేవ్ పూర్, కాటారం, భూపాలపల్లి, పరకాల మీదుగా గూడప్పాడ్ వరకు 369 జాతీయ రహదారి ఉంది. ఈ జాతీయ రహదారి గూడప్పాడ్ వద్ద 163 జాతీయ రహదారిలో కలుస్తుంది. సిరొంచ-గూడప్పాడ్ జాతీయ రహదారిలో భూపాలపల్లి జిల్లా కేంద్రం ఉంది. భూపాలపల్లి జిల్లా కేంద్రమైన పుటి నుంచి ఈ హైవే మీదుగా వాహనాల రాకపోకలు గణనీయంగా పెరిగాయి. దీనికి తోడు భూపాలపల్లి జిల్లాలోని మహాదేవపూర్, పలిమెల, మల్హర్, కాటారం మండలాల్లో ఇసుక క్వారీలు ఉన్నాయి. గోదావరి, మానేరు నదుల నుంచి భూపాలపల్లి మీదుగా లారీల ద్వారా వరంగల్ నగరం సహా హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ఇసుక రవాణా జరుగుతుంది. ప్రతిరోజు సుమారు 1500 నుంచి 2 వేల లారీల ద్వారా ఇసుక భూపాలపల్లి పట్టణం నుంచి ఈ హైవే మీదుగా తరలిపోతుంది. అంతేకాదు భూపాలపల్లి ఏరియాలో సింగరేణి బొగ్గు గనులు ఉన్నాయి. ఈ గనుల నుంచి ఉత్పత్తి అవుతున్న బొగ్గు వివిధ ప్రాంతాలకు లారీలు, టిప్పర్ల ద్వారా రవాణా జరుగుతుంది. ఇక్కడ భూపాలపల్లి సమీపంలో చెల్పూర్ వద్ద హైవేను అనుకుని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు (కేటీపీపీ) ఉన్నది. మల్హర్ మండలంలోని తాడిచర్ల ఓపెన్ కాస్ట్ నుంచి భూపాలపల్లి పట్టణం నుంచి హైవే మీదుగా, భూపాలపల్లి ఏరియాలోని గనుల నుంచి కూడా బొగ్గు ఈ హైవే మీదుగా కేటీపీపీకి లారీల ద్వారా చేరుతుంది. కేటీపీపీ నుంచి వెలువడుతున్న బూడిద కూడా భారీ వాహనాల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిపోతుంది. ఇలా ఇసుక, బొగ్గు, బూడిద రవాణా లారీలు, టిప్పర్లతో పాటు జిల్లా కేంద్రమైనందున 369 హైవేపై భూపాలపల్లి పట్టణంలో భారీ వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. ప్రధానంగా ఈ పట్టణంలో ఈ ఒకే ఒక మెయిన్ రోడ్డు ఉండడం వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. పట్టణంలో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ మెయిన్ రోడ్డుపై ధర్నా, రాస్తారోకో జరిగిన సమయంలో వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ నేపథ్యంలో భూపాలపల్లి పట్టణం బయట నుంచి బైపాస్ రోడ్డు నిర్మించాలనే ప్రతిపాదన కొన్నేళ్ల క్రితం తెరపైకి వచ్చింది.

### - బైపాస్ రోడ్డుకు ఎస్టిమేట్స్

సంవత్సరంనర క్రితం రోడ్లు భవనంల శాఖ ఇంజనీర్లు గూడప్పాడ్- సిరొంచ 369 హైవేలో భూపాలపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు చేశారు. ప్రభుత్వం నుంచి ఈ ప్రతిపాదనలకు ఆమోదం లభించినట్లు వార్తలు కూడా వెలువడ్డాయి. ఆ తర్వాత 2023 చివరలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అనంతరం ఏడాదిన్నర క్రితం చేసిన బైపాస్ రోడ్డు ప్రతిపాదనలు పక్కనపడ్డాయి. ఈ క్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు భూపాలపల్లికి బైపాస్ రోడ్డు నిర్మించాల్సిన ఆవశ్యకతను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఎన్ హెచ్ అధికారులపై బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం ఒత్తిడి తెచ్చారు. భూపాలపల్లి పట్టణంలో వాహనాల రద్దీ పెరగడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నందున బైపాస్ రోడ్డు నిర్మించాలని శాసనసభ సమావేశాల్లోనూ ఎమ్మెల్యే జీఎస్సార్ ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ఎన్ హెచ్ అధికారులు గూడప్పాడు- సిరొంచ 369 ఎన్ హెచ్ పై ఉన్న లక్ష్మారెడ్డి పల్లె గ్రామం నుంచి ఎడమవైపు మీదుగా భూపాలపల్లి పట్టణం టచ్ కాకుండా పట్టణ శివారులో ఉన్న బాంబుల గడ్డ వద్దకు 19 కిమీ బైపాస్ రోడ్డు నిర్మించేలా ఎన్ హెచ్ అధికారులు రూ.220 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. ఈ మేరకు ఎస్టిమేట్స్ తయారుచేసి ఆమోదం కోసం ఇటీవల ఢిల్లీకి పంపారు. గ్రీన్ సిగ్నల్ లభించగానే డీపీఆర్ తయారు చేయడానికి సిద్ధంగా ఉన్నారు. నిధులు మంజూరు కాగానే ఈ ఏడాది భూపాలపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాలనే ఆలోచనలో ఎన్ హెచ్ అధికారులు ఉన్నట్లు తెలిసింది. ఇందు కోసం స్థానిక ఎమ్మెల్యే గండ్ర చొరవ చొరవ చూపుతున్నట్లు సమాచారం.



## తవ్వే కొద్ది..

# టోల్ బాధితులు..!

- టోల్ ప్లాజా నిర్వాహకుల నిర్వాకంపై సర్వత్రా చర్చ
- మాక్కూడా ఇలానే జరిగిందంటూ వెలుగులోకి బాధితులు
- లక్షల్లో స్కాం జరిగిందంటూ గుసగసలు
- టోల్ ప్లాజా నిర్వాహకులపై చర్యలకు బీఆర్ఎస్ పార్టీ డిమాండ్

అక్షరదర్బార్, కాటారం : జయశంకర్ భూపాలపల్లి కాటారం మండలంలోని మేడిపల్లి వద్ద జాతీయ రహదారి 353C పై ఏర్పాటు చేసిన టోల్ ప్లాజా అక్రమ వసూళ్ల బాగోతంపై అక్షర దర్బార్ ఇచ్చిన కథనంపై ప్రకంపనలు మొదలయ్యాయి. తవ్వే కొద్ది టోల్ ప్లాజా బాధితులు ఒక్కొక్కరిగా బయటికి వస్తున్నారు. మాకంటే మాక్కూడా సేమ్ ఇలానే జరిగిందంటూ 'అక్షరదర్బార్' కు విన్నవించుకుంటుకున్నారు. ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక ఇన్నాళ్లు గమ్మున్న ఊరుకున్నామని బాధితులు వాపోతున్నారు.టోల్ ప్లాజా వద్ద ఫాస్టాగ్ రూపంలో కట్ అవుతున్న ఎక్స్ ట్రా అమౌంట్ తీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.కాటారం సబ్ డివిజన్ మండలాల్లోని వాహనాదారుల పరిస్థితే ఇలా ఉంటే నిత్యం కాళేశ్వరంకు వచ్చి పోయే వాహనాలు,ఇసుక లారీల దుస్థితి మరెలా ఉందో అర్థం చేసుకోవచ్చుంటూ బాధితులు చర్చించుకుంటున్నారు. కాగా అక్రమ వసూళ్ల విధానంపై అధికారులు వ్యవహరిస్తున్న మెతక వైఖరి తీరుపై సైతం వాహనాదారుల నుండి తీవ్రమైన ప్రతివాదనలు వినిపిస్తున్నాయి.

### లక్షల్లో స్కాం జరిగిందంటూ చర్చలు..

మేడిపల్లి టోల్ ప్లాజా వద్ద అక్రమ వసూళ్ల తతంగాన్ని చూస్తుంటే లక్షల్లో పెద్ద స్కాం జరిగే అవకాశాలు ఉంటుందంటూ వాహనాదారులు చర్చించుకుంటున్నారు. రోజుకి ఇసుక లారీలతో పాటు మిగతా వాహనాలతో మొత్తంగా కలిపి రెండు వేల వాహనాలు టోల్ ప్లాజా గుండా నడుస్తుంటాయి . ఈ నేపథ్యంలో 200 వాహనాలకు ఫాస్టాగ్ నుండీ ఎక్స్ ట్రా అమౌంట్ కట్ అవుతుందనుకుంటే ఎంతలేదన్న రోజుకి రూ.30 వేల స్కాం జరిగే ఉంటుందంటూ వాదనాలు వినిపిస్తున్నాయి. ఈ తతంగం కొన్ని సంవత్సరాలుగా జరుగుతూ ఉంటున్న క్రమంలో టోల్ ప్లాజా నిర్వాహకులు లక్షల్లో స్కాం చేసి ఉండొచ్చని వాహనాదారులు చర్చించుకుంటున్నారు.

### టోల్ ప్లాజా అక్రమ వసూళ్లను అరికట్టాలి

#### బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్



కాటారం మండలం లోని మేడిపల్లి జాతీయ రహదారి 353 సి పై గల టోల్ ప్లాజా నిర్వాహకులు వాహనాదారుల నుండి అక్రమ వసూళ్లు చేస్తున్నారని అలాంటి అక్రమ వసూళ్లను వెంటనే అరికట్టాలని కాటారం బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్ డిమాండ్ చేశారు. మేడిపల్లి టోల్ ప్లాజా నుండి వెళ్తున్న వాహనాలకు కట్ అయినా అమౌంట్ తర్వాత ఆ వెనువెంటనే అదే ఛార్జీలని కట్ చేస్తూ వాహనదారులను టోల్ ప్లాజా నిర్వాహకులు బురిడీ కొడుతున్నారని ఆరోపించాడు. రోడ్డు మెయింటెనెన్స్ కింద రోడ్లు బాగు చేయాల్సింది ఉండగా అలాంటివేం పట్టించుకోకపోవడంతో రోడ్లు అద్వాన్నంగా తయారయ్యాయని పేర్కొన్నారు. అలాగే టోల్ ప్లాజా వద్ద కనీస సౌకర్యాలైన మంచినీటి సదుపాయం, టాయిలెట్స్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. ఇప్పటికైనా సంబంధిత నేషనల్ హైవే అథారిటీ అధికారులు, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి అధిక వసూళ్ల పర్వాన్ని అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకుడు రామిళ్ల రాజబాపు పాల్గొన్నారు.

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State. Editor : VEMULA RAJESHWER RAO, email : akshardarbarnews@gmail.com, office No : 7680992278★ RNI NO. TELTEL/2022/81915